

# పరిష్కారం?

- పాణుగుపాటి వెంకటకృష్ణారావు

నీరసంగా తలపట్టుకుని కూర్చుంది లంచ్ అవర్‌లో విజయ. సహోద్యోగులందరూ క్యారియర్స్‌తో లంచ్ రూమ్‌కి బయలుదేరుతుంటే విజయ ఒక్కర్తీ అలా కూర్చోవడంతో చూస్తూ ఉండలేకపోయింది శారద.

"విజయా!ఎనీ ప్రాబ్లమ్?" అడిగింది టేబుల్ పై రెండు చేతులు ఆనించి ఆమెకే వినబడేటట్టు.

"సమ్మోర్" విచారంగా అంది విజయ.

"కెనై హెల్ప్ యు" కుతూహలంగా అడిగింది శారద.

"నువ్వు చేయడానికి ఏమీలేదే. ఒక సలహా ఇస్తే చాలు. ఆనందంగా పోతాను...." అంది విజయ.

"ఏ విషయంలో?"

"మనిషికి పంచప్రాణాలు ఉంటాయంటారు. అందులో మూడింటిని ముగ్గురు పంచుకులాక్కుపోతున్నారు. మిగిలిన రెండుతో ఈ కష్టాలు పడలేను. ఆ రెండు కూడా బయటికి పోయే మార్గం చూపించు"అంది బాధగా.

"కాస్త అర్థం అయ్యేటట్టు చెప్పు తల్లీ" అంది శారద బ్రతిమాలుతున్నట్టు.

"ముగ్గురు మూర్ఖులు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారే. అందులో మొదటిది మా ఆయన, సస్పెండ్ అయిన దగ్గరనుంచి క్రమం తప్పకుండా బార్‌కి వెళ్ళి ఫుల్‌గా మందేసుకుని వచ్చి సతాయింపులు, అనుమానాలు. రెండోవాడు నా సుపుత్రుడు. ఆయన వెళ్ళిన బార్‌కి వెళితే బాగుండదని వెరైటీగా క్లబ్‌కి వెళ్ళి ఎంత తగలేస్తున్నాడో తెలియదు.

ఇక మూడవది మా ముద్దుల పట్టి. ప్రతిరోజూ కాలేజ్ నుంచి ఎవరో ఒకరు డ్రాప్ చేస్తూ ఉంటారు. సహజంగా ఆరుకి రావలసినది ఎనిమిదికి వస్తుంది. ఏమంటే ఏదో ఒకటి చెబుతుంది. ఇంకా గట్టిగా అడిగితే అరుస్తుంది. బిపి పేషెంట్‌లా అది లేటుగా వచ్చినప్పుడల్లా మా ఆయనకి, నాకూ గొడవే. ఈ ముగ్గురునుంచి తప్పించుకునే ఉపాయం చెప్పవే"అంది సవివరంగా వివరిస్తూ విజయ.

"ఓస్ ఇంతేనా...ఇదో పెద్ద సమస్యా? దానికి ఆలోచించి పరిష్కారించుకోవడం.." సింపుల్‌గా అంది శారద. ప్రక్కనున్న ఛైర్‌ని ముందుకి లాక్కుని కూర్చుంటూ.

"ఒకనెలో, రెండునెలలో మెడికల్ లీవ్ పెట్టి కన్నవారింటికి చెక్కెయ్. తిక్క కుదురుతుంది అందరికీ"

"ఎలా?"

"ఎలా ఏమిటి? నువ్వుంటే కదా అడగడానికి. నాలుగురోజుల్లో బోర్ కొడుతుంది. నువ్వు లేని లోటు తెలుస్తుంది మీ ఆయనకి. ఇక మీవాడు ఆయనగానీ, నువ్వు గానీ డబ్బులిస్తే కదా క్లబ్‌కి వెళ్లేది? నువ్వు ఉండవు. ఆయనకి తీర్థానికి చాలదు. నోరుమూసుకుని ఇంటి దగ్గరే పడుంటాడు"అంది.

"అప్పుచేస్తే?"

"పరువుగా బ్రతికేవాళ్లకే అప్పు పుట్టడం లేదు. వాడికి ఎవరిస్తారు? ఇక మీ పాప... నువ్వు వండిపెడుతున్నావు కనుక ఎంత లేటుగా వచ్చినా ఫర్వాలేదు నాలుగు మెతుకులు పడేస్తావు. అదే నువ్వు లేని నాలుగురోజులు చూస్తుంది భోజనానికి ఇబ్బందిని. వంట ఎవరు చేస్తారని తండ్రి, అన్నయ్య గట్టిగా మందలిస్తారు. తిక్కకుదిరి బుద్ధిగా ఇంటికి వచ్చి వంట చేస్తుంది. మా చుట్టాలావిడకి నీలాంటి సమస్యే వస్తే ఇలాగే చేసింది. నెలరోజులలో అన్నీ చక్కబడి మనశ్శాంతిగా ఉంటోంది"

"అలాగే జరుగుతుందంటావా?"

"చేసి చూడు..."

ఆరోజే నెలా పదిహేనురోజులకి సిక్‌లీవ్ పెట్టి కన్నవారింటికి విశాఖపట్నం చేరుకుంది విజయ.

* * *

లీవ్ పూర్తవ్వడానికి అయిదురోజుల ముందు ఇంటికి వచ్చింది విజయ. ఆటో దిగి డబ్బులిచ్చి ఇంటివైపు చూసిన విజయకి ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. అందుకు కారణం గేట్‌కి గానీ, ఇంటికి గానీ తాళం లేకపోవడమే. గేట్ తీసుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన విజయకి ఆశ్చర్యంతో నోరు తెరుచుకుంది. అందుకు కూడా కారణం లేకపోలేదు.

"అమ్మా.. ఇంకో అయిదురోజులు లీవ్ ఉందిగా?" అడిగిన కూతురి ప్రశ్నకి ఆశ్చర్యం నుంచి తేరుకుంది.

"ఈయన ప్రకాష్ అని..నీ అల్లుడు.."

"నువ్వు మా ప్రేమని అంగీకరిస్తావని తెలుసు. వాళ్ళ బామ్మగారి ఆరోగ్యం సరిగా లేకపోతే ఆవిడ కోరిక మీదట రిజిస్టర్ ఆఫీసులో పెళ్ళి చేసుకున్నాం" ధైర్యం, నిర్లక్ష్యం కలిగిన స్వరంలో వినిపించిందామెకు.

"మీ నాన్నగారు"

"నాన్నగారు నువ్వెళ్ళిన మర్నాడే వెళ్ళారు. ఇంతవరకూ ఇంటికి రాలేదు. రోజూ ఫోన్ చేస్తున్నారు" అంది.

"అన్నయ్య సంగతి?"

"అన్నయ్య గురించి అడగకమ్మా. క్లబ్‌లో పాతికవేలు పోగొట్టుకున్నాడట. వాళ్ళు ఇంటికి వచ్చి గొడవచేస్తారని భయంతో ఎటో వెళ్ళిపోయాడు"

నెత్తిన పిడుగు పడ్డట్టయింది విజయకి. తనకి మిగిలిన ఉన్న రెండు ప్రాణాలని ఈరకంగా పోయే మార్గం చూపించిన శారదని మనసులోనే తిట్టుకుంది.

తనులేకుంటే ఇల్లు చక్కబడుతుందని అనుకునే కన్నా తను జాబ్ వదులుకుని, ఇంటి పట్టునుండి ప్రయత్నం చేస్తే ఇల్లు బాగుపడుతుంది, ఇంకొకరికి ఉపాధి దొరుకుతుందని దృఢనిశ్చయానికి వచ్చింది విజయ.

★